నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
01-05-2025
పేజీలు: 02


## ఐపీఎల్‌లో నేడు



రాజస్తాన్ VS ముంబై
జైపూర్,
రాత్రి:7.30



స్టార్ స్పోర్ట్స్,
జియో హాట్
స్టార్‌లో..

## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| ఆర్సీబీ | 10 | 7 | 3 | 14 |
| పంజాబ్ | 10 | 6 | 3 | 13 |
| ముంబై | 10 | 6 | 4 | 12 |
| గుజరాత్ | 9 | 6 | 3 | 12 |
| ఢిల్లీ | 10 | 6 | 4 | 12 |
| లక్నో | 10 | 5 | 5 | 10 |
| కొల్‌కత్తా | 9 | 4 | 5 | 9 |
| రాజస్తాన్ | 10 | 3 | 7 | 6 |
| సన్‌రైజర్స్ | 9 | 3 | 6 | 6 |
| చెన్నై | 10 | 2 | 8 | 4 |



ఆరెంజ్ క్యాప్
456
ఐపీఎల్
అత్యధిక రన్స్



పర్పుల్ క్యాప్
18
ఐపీఎల్
అత్యధిక వికెట్స్




# హిట్ 3 సినిమా రివ్యూ

'హిట్' ఫ్రాంచైజీలో వచ్చిన రెండు సినిమాలూ సూపర్‌హిట్స్ కావడంతో ఆటోమేటిగ్గా 'హిట్ 3'పై అంచనాలు ఏర్పాడ్డాయి. నాని కూడా వరుస విజయాలతో దూసుకుపోతుండటం కూడా ఈ అంచనాలకు ఓ కారణం. ఈ సినిమా ప్రచారం విషయంలో కూడా మేకర్స్ ఎక్కడా రాజీ పడలేదు. ప్రచార చిత్రాల వల్ల మూవీకి వచ్చిన బజ్ రెట్టింపయ్యింది. మరి అందరి అంచనాలనూ నిజం చేస్తూ 'హిట్ 3' విజయాన్ని సాధించిందా? 'హిట్' ఫ్రాంచైజీలో మూడో విజయం నమోదైందా? అనేది తెలుసుకోవాలంటే ముందు కథలోకి వెళ్లాలి. విధి నిర్వహణ విషయంలో ఎంతకన్నా తెగించే పోలీస్ ఆఫీసర్ అర్జున్ సర్కార్ ఐపీఎస్(నాని). క్రిమినల్ అనేవాడు నేలలో అరగడుల హోల్‌లో నైనా ఉండాలి. లేకపోతే పోలీస్ సెల్‌లోనైనా ఉండాలనే తత్వం అతనిది. ఒక క్రిమినల్‌ని చంపే క్రమంలో వందమంది అమాయకులు చచ్చినా తను కేర్ చేయడు. చేతికి దొరికిన క్రిమినల్స్‌కి నరకం చూపించి మరీ చంపుతాడు. ఇదిలావుంటే ఓ సైకో కిల్లర్ వరుసగా హత్యలు చేస్తూ పోలీసులకు తలనొప్పిగా మారతాడు. తాను చంపడమే కాక, ఓ వెబ్‌సైట్‌ని ఏర్పాటు చేసి, ఆ వెబ్‌సైట్ ద్వారా ఓ సైకో సామ్రాజ్యాన్నే క్రియేట్ చేస్తాడు. అమాయకుల్ని పాశవికంగా చంపుతూ వీడియోలు తీసి ఆ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తుంటారు. దేశంలో ఉన్న సైకోలంతా ఈ వెబ్‌సైట్ మెంబర్లే. అలాంటి ఓ సైకో సామ్రాజ్యాన్ని నిర్వీర్యం చేసే బాధ్యతను అర్జున్ సర్కార్ తీసుకుంటాడు. మరి ఆ సైకో సామ్రాజ్యంలోకి అర్జున్ ఎలా ప్రవేశించాడు? ఏ విధంగా అక్కడ దుష్టసంహారం చేశాడు? అనేది మిగతా కథ. కమర్షియల్ సినిమాల విషయంలో కొత్త కథలను కోరుకోవడం ప్రేక్షకులకు ఇప్పుడున్న పరిస్థితుల్లో అత్యాసే అవుతుంది. కథ పాతదైనా దాన్ని కొత్తగా ఎలా ప్రజెంట్ చేశాడు.. అనేది మాత్రమే ఇప్పుడు ముఖ్యం. ఈ విషయంలో దర్శకుడు శైలేష్ కొలను సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. ఈ సినిమాకు కథనం హైలైట్. నాని పోషించిన అర్జున్ సర్కార్ పాత్ర అరెస్ట్ అవ్వడంతో.. ఈ సినిమా కథ మొదలైంది. అలా ఓ ప్రశ్నతో కథను మొదలుపెట్టి.. దానికి ఆసక్తికరమైన సమాధానం ఇచ్చాడు దర్శకుడు. ప్రథమార్ధం అంతా స్క్రీన్‌ప్లే బేస్డ్‌గా సినిమా సాగింది. స్ట్రయిట్ నేరేషన్‌లో కాకుండా, హాఫ్‌వేలో సినిమా మొదలుపెట్టి ప్రేక్షకుల మనసుల్లో ఏర్పడిన చిక్కుముళ్లను ఒక్కొక్కటి విప్పుతూ సెకండాఫ్ దాకా ఇంట్రస్టింగ్‌గా సినిమా నడిపించాడు. ఇక సెకండాఫ్ మొత్తం సినిమా స్ట్రయిట్ నేరేషన్. ఓ విధంగా 80లో చిరంజీవి నటించిన 'కిరాతకుడు' సినిమాను గుర్తు చేస్తుంది. విలన్ సామ్రాజ్యంలోకి హీరో ఒక్కడే అడుగుపెట్టడం.. అక్కడున్న రహస్యాలన్నింటినీ తెలుసుకునే క్రమంలో హీరో పలు ప్రమాదాల్లో ఇరుక్కోవడం.. అందులోంచి బయటపడేందుకు చేసే ప్రయత్నాలు.. చివరకు విలన్ మూకను కత్తికొక కండగా నరికి చంపటాలు.. ఇవన్నీ నిజంగా మాస్ ప్రేక్షకులకు విజువల్ ఫీస్టే. అసలు అర్జున్ సర్కార్ కేరక్టర్ ఇంట్రో నుంచే ఆ పాత్రపై ఆసక్తిని రేకెత్తించాడు దర్శకుడు శైలేష్ కొలను. క్రిమినల్స్‌తో తను గడిపే సన్నివేశాలు.. క్రిమినల్స్‌ని తను చంపే సన్నివేశాలు నిజంగా ఆడియన్స్‌కి వణుకు పట్టిస్తాయి. ఓ వైపు శత్రు సంహారం భయంకరంగా జరుగుతుంటే.. మరోవైపు చాగంటిగారి ప్రవచనాలు వినిపించడం విభిన్నంగా ఉంది. మొత్తంగా శైలేష్ 'హిట్' మూడో భాగాన్ని కూడా జనం మెచ్చేలాగే తీశాడు. కానీ.. సినిమాలో హింస పాళ్లు మరీ ఎక్కువైంది. ముఖ్యంగా సెకండాఫ్‌లో అయితే.. తెర మొత్తం రక్తసిక్తమే. కానీ హీరో అలా స్పందిచడానికి బలమైన కారణం ఉండటం వల్ల ఆ హింస కూడా జనరంజకంగానే ఉందని చెప్పాలి. చివర్లో అడవి శేషు సడన్ ఎంట్రీకి మంచి స్పందన వచ్చింది. ఇక 'హిట్ 4' అంటూ కార్తీ ఎంటర్ అవ్వగానే.. థియేటర్ దద్దరిల్లిపోయింది. మాస్ కేరక్టర్లను కూడా నాని బాగా చేస్తాడని జెంటిల్‌మేన్, దసరా సినిమాలు ఇప్పటికే ప్రూవ్ చేశాయి. ఆ రెండు సినిమాలకంటే యాక్షన్ పాళ్లు 'హిట్ 3'లో ఇంకాస్త ఎక్కువే అని చెప్పాలి. నాని కూడా దానికి తగ్గట్టే బాగా కష్టపడ్డాడు. రూత్‌లెస్ పోలీస్ ఆఫీసర్‌గా అద్భుతంగా నటించాడు. హీరోయిన్ నిధిశెట్టితో ప్రేమ సన్నివేశాల్లో ఎంత రొమాంటిగ్గా నటించాడో, యాక్షన్ సీన్స్‌లో అంత భయంకరంగా కనిపించాడు.

# రెట్రో సినిమా రివ్యూ

కోలీవుడ్ విలక్షణ నటుడు సూర్య హీరోగా పూజా హెగ్డే హీరోయిన్ గా దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన లేటెస్ట్ అవైటెడ్ చిత్రమే 'రెట్రో'. సూర్య నుంచి కంబ్యాక్ సినిమా అవుతుంది అనిపించేలా ఒక ఇంట్రెస్టింగ్ గ్యాంగ్ స్టర్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రం ఎలా ఉందో రివ్యూలో తెలుసుకుందాం. ఈ చిత్రం 1993 సమయంలో జరిగే కథ కాగా తన చిన్నతనంలోనే పారివేల్ కణ్ణన్ (సూర్య) తన తల్లిదండ్రుల నుంచి వేరయ్యి ఒక గ్యాంగ్ స్టర్ తిలక్ రాజ్ (జోజు జార్జ్) కి దొరుకుతాడు. అయితే అతని భార్య కోరికతో పెంచుకుంటాడు కానీ పారి అంటే ఇష్టం ఉండదు. తను దొరికిన పరిస్థితులుతో పారికి చిన్నతనం నుంచి నవ్వు అనేది ఉండదు. ఆ తర్వాత రుక్మిణి (పూజా హెగ్డే) తో జరిగిన పరిచయం ఎలా ప్రేమగా మారింది. ఈ క్రమంలో తన కోపం, నవ్వు పారి జీవితంలో ఎలాంటి పాత్ర పోషించాయి. అసలు ఈ పారి ఎవరు? ఏ ప్రాంతానికి చెందినవాడు? ఈ మొత్తంలో అండమాన్ లో ఒక దీవిలో ప్రజలని బానిసలుగా చేసిన దొరలు రాజ్ వేల్, తన కొడుకు మైఖేల్ (వేదు) లు చేసే అరాచకాలు ఏంటి? అక్కడికి పారి ఎందుకు వెళ్ళాల్సి వస్తుంది? అలాగే తిలక్ రాజ్ కోరుకుంటున్న గోల్డ్ ఫిష్ కి పారికి ఉన్న లింక్ ఏంటి అనేవి తెలియాలి అంటే ఈ చిత్రాన్ని చూసి తెలుసుకోవాలి. ఈ సినిమాలో ఫస్టాఫ్ మంచి బలం అని చెప్పవచ్చు. మేకర్స్ అనౌన్స్ చేసిన లవ్, లాఫ్టర్ (నవ్వు), వార్ ఈ పాయింట్స్ కి తగ్గట్టుగా నడిపిన కథనం మంచి ఇంట్రెస్టింగ్ గా సాగుతుంది. ఈ క్రమంలో సూర్య నటన కూడా సాలిడ్ గా ఉందని చెప్పవచ్చు. తన లోని నటుణ్ని మిస్ అవుతున్న వారికి చాలా కాలం తర్వాత ఈ సినిమా ఫస్టాఫ్ లో అలాగే తనలో ఉన్న లోపంని అద్దంలో చూసుకునే సీక్వెన్స్ లో సూర్య జీవించేశారు అని చెప్పడంలో సందేహం లేదు. అలాగే తనపై పలు క్రేజీ సీన్స్, యాక్షన్ ఎపిసోడ్స్ కూడా బాగున్నాయి. ఇంకా కొన్ని ఎమోషనల్ సీన్స్ కూడా బాగున్నాయి.ఇంకా పూజా హెగ్డే తన రోల్ లో బానే చేసింది. వీరితో పాటుగా జోజు జార్జ్ ఇంకా జైరాం లు తమ గత సినిమాలు నుంచి కొంచెం డిఫరెంట్ పాత్రల్లో కనిపించి మెప్పిస్తారు. అలాగే నెగిటివ్ రోల్ లో కనిపించిన యంగ్ నటుడు విదు తన పాత్రలో మంచి పెర్ఫామెన్స్ ని అందించాడు. అలాగే దర్శకుడు ఎంచుకున్న పాయింట్ అందుకు తగ్గ కొన్ని కనెక్షన్ లు అలాగే ఫస్టాఫ్ లో ఒక సింగిల్ టేక్ సీక్వెన్స్ మొత్తం ఆడియెన్స్ ని ఆకట్టుకుంటాయి. దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ మరోసారి సెకండాఫ్ ని ఎంగేజింగ్ గా నడపడంలో తడబడ్డారు అని చెప్పక తప్పదు. ఒక డీసెంట్ ఫస్టాఫ్ ని కొనసాగించి యుద్ధంతో ఇంట్రెస్టింగ్ లీడ్ ఇచ్చి సెకండాఫ్ కి మంచి స్కోప్ ని హోప్ ని ఇచ్చేలా సెట్ చేసి సెకండాఫ్ ని మాత్రం డల్ గా సాగదీతగా నడిపించారు. కథ ఒకలా మొదలై అది కాస్తా ఏటెటో వెళుతుంది. వీటితో ఆడియెన్స్ ఏకాగ్రత తప్పుతుంది. సూర్యపై కొన్ని సీన్స్ బాగానే అనిపిస్తాయి కానీ అవన్నీ ఫ్లోలో కరెక్ట్ గా లేవు అనిపించక మానదు. అలాగే ప్రీ క్లైమాక్స్ సూర్యపై ట్విస్ట్ వచ్చే వరకు కథనం అంతా చప్పగా సాగుతున్నట్టు అనిపిస్తుంది. అలాగే చాలా సీన్స్ ఆడియెన్స్ కి ఇది వరకే ఎక్కడో చూసినట్టే అనిపిస్తాయి.అంతే కాకుండా అక్కడక్కడా సన్నివేశాలు ఈజీగా ఊహించే రేంజ్ లోనే కొనసాగుతాయి. మరో డ్రా బ్యాక్ ఏదన్నా ఉంది అంటే క్లైమాక్స్ కూడా అని చెప్పొచ్చు. కార్తిక్ సుబ్బరాజ్ అనుకున్న పాయింట్ కి ప్లాన్ చేసుకున్న క్లైమాక్స్ అంత ఎఫెక్టీవ్ గా అయితే అనిపించలేదు. అప్పుడు వరకు అంతా స్ట్రాంగ్ గా ఉన్న విలన్లు చాలా ఈజీగా లొంగిపోయినట్టు అనిపిస్తుంది. వీటితో చాలా అంశాలు మాత్రం సెకండాఫ్ లో డిజప్పాయింట్ చేస్తాయి. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు బాగున్నాయి. సంతోష్ నారాయణన్ తన సంగీతంతో చాలా సీన్స్ కి మంచి స్కోర్ అందించి ఎలివేట్ చేసాడు. అక్కడక్కడా కాలా సినిమా స్కోర్ కూడా కొట్టేసాడు. శ్రేయస్ కృష్ణ, సినిమాటోగ్రఫీ బాగుంది. నేపథ్యంకి తగ్గట్టుగా మంచి రెట్రో విజువల్స్ అందించారు. ఎడిటింగ్ ఇంకొంచెం బెటర్ గా డిజైన్ చేయాల్సింది. తెలుగు డబ్బింగ్ విలువలు బాగున్నాయి. తీసుకున్న జాగ్రత్తలు హర్షణీయం. ఇక దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ విషయానికి వస్తే తను ఎంచుకున్న లైన్ అందులో పాయింట్స్ బాగున్నాయి కానీ వాటికి అనుగుణంగా రాసుకున్న కథనం మాత్రం ఫుల్ ఫ్లెడ్జ్ గా ఆకట్టుకునేలా లేదు. మెయిన్ గా సెకండాఫ్ వీక్ గా సాగింది. ఎక్కడో ప్రీ క్లైమాక్స్ లో కలిపిన లింక్ ఒకే కానీ పూర్తి స్థాయిలో ఆడియెన్స్ ని ఎంగేజ్ చేయగలిగే రేంజ్ లో అయితే తన వర్క్ సాగలేదు. ఫస్టాఫ్ వరకు మాత్రం తన మార్క్ కనిపించింది. ఇక మొత్తంగా చూసుకున్నట్టైతే ఈ "రెట్రో" సినిమాలో మంచి కీ పాయింట్స్ కనిపిస్తాయి అలాగే సూర్య సాలిడ్ పెర్ఫామెన్స్ తో సినిమాకి మెయిన్ పిల్లర్ గా నిలిచారు కానీ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ మాత్రం ఫుల్ ఫ్లెడ్జ్ గా కథనం ఆసక్తిగా నడపలేదు. ఫస్టాఫ్ వరకు తన వర్క్ ఒకే కానీ సెకండాఫ్ లో మాత్రం తన కథనం ఆడియెన్స్ కి రుచించదు. సో వీటితో సూర్య అభిమానులు వరకు చాలా తక్కువ అంచనాలు పెట్టుకొని ట్రై చేస్తే మంచిది.






# మే డే శుభాకాంక్షలు

మే 1.. ఈ రోజు అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం. కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 1886, మే 1న షికాగోలని హే మార్కెట్లో జరిగిన పోరాటాన్నే నేడు 'మే డే'గా నిర్వహిస్తున్నారు. నాడు జరిగిన ఈ ఉద్యమానికి మద్దతుగా నాలుగు రోజుల తర్వాత షికాగోలోని హే మార్కెట్‌లో భారీ ప్రదర్శన నిర్వహించారు. అది ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ మారణకాండను నిరసిస్తూ అనేక దేశాల్లో ఉద్యమాలు జరిగాయి. షికాగో మారణకాండలో ప్రాణాలర్పించిన కార్మికులను స్మరిస్తూ.. ఏటా మే 1వ తేదీన కార్మిక దినోత్సవం నిర్వహిస్తున్నారు. అప్పటి నుంచి మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు మే డే వేదికగా మారింది. అనేక దేశాల్లో ఆ రోజున పోరాటాలూ, నిరసన ప్రదర్శనలూ చేపట్టడం పరిపాటైంది. 1923 నుంచి ఇండియాలో 'మే డే'ను పాటించారు. కరోనా వల్ల గతేడాది నుంచి ఎంతోమంది శ్రమ జీవులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. వారిలో ధైర్యం నింపడం మన అందరి కర్తవ్యం. ఈ కోటేషన్ల ద్వారా వారిలో ధైర్యాన్ని నింపడంతోపాటు మే 1న ప్రాణాలర్పించిన కార్మికులను స్మరిస్తూ.. శ్రామిక సోదరులకు 'మే డే' శుభాకాంక్షలు తెలుపుదాం.

ఇది కష్టకాలం..
కరోనా మన ఉపాధిని చిదిమినా..
ధైర్యంతో ముందుకు సాగుదాం..
మంచి రోజుల కోసం ఎదురుచూద్దాం..
రెట్టింపు ఉత్సాహంతో శ్రమిద్దాం..
జీవితాన్ని మళ్లీ వెలుగులు నింపుకుందాం.
శ్రామికులందరికీ మే డే శుభాకాంక్షలు



## కార్మిక సోదరులందరికీ మేడే శుభాకాంక్షలు: రేవంత్ రెడ్డి

మేడే సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములని పేర్కొన్నారు.ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రజాప్రభుత్వం పాలనలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ స్ఫూర్తి అన్ని రంగాలకు విస్తరిస్తుందని, కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. మే డే స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. తాము అధికారం చేపట్టిన వెంటనే గిగ్ వర్కర్ల కోసం రూ.5లక్షల ప్రమాద బీమాను అమలు చేశామని తెలిపారు. ఇక, తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్ల సంక్షేమ బిల్లు-2025ను త్వరలో తీసుకువస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేశామన్నారు. గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# చాహల్ మ్యాజిక్

## 19వ ఓవర్‌లో 4 వికెట్లు, హ్యాట్రిక్..

ఐపీఎల్‌లో బ్యాటర్లు బాదడమే పనిగా పెట్టుకున్నారు. పరుగుల వరద పారుతోంది. బౌలర్లకు ఒక్కో బంతి వేయాలంటే వణుకు పుడుతోంది. అలాంటిది ఒకే ఓవర్‌లో హ్యాట్రిక్ సహా 4 వికెట్లు తీశాడు. అది కూడా ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్పిన్నర్, పంజాబ్ కింగ్స్ ఆటగాడు యజ్వేంద్ర చాహల్ ఈ ఫీట్ సాధించాడు. తాను ఎందుకు ప్రత్యేకమో మరోసారి నిరూపించాడు. ఒక దశలో 17.4 ఓవర్లలో 172/4తో భారీ స్కోరు దిశగా సాగిన చెన్నై సూపర్ కింగ్స్.. చాహల్ అద్భుత ప్రదర్శనతో 19.2 ఓవర్లకు 190 పరుగులకు ఆలౌట్ అయ్యింది. పేలవ ప్రదర్శనతో ఐపీఎల్ 2025లో దాదాపుగా ప్లే ఆఫ్స్‌కు దూరమైంది చెన్నై సూపర్ కింగ్స్. ఇకపై ఆ జట్టుకు ప్రతి మ్యాచ్ కీలకమే. అలాంటి తరుణంలో బుధవారం (ఏప్రిల్ 30) పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అనూహ్యంగా తడబడింది. ఓ దశలో పటిష్ట స్థితిలో నిలిచిన ఆ జట్టు యుజ్వేంద్ర చాహల్ మాయాజాలంతో చివరి 5 వికెట్లను కేవలం ఏడు బంతుల వ్యవధిలోనే కోల్పోయింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. తొలుత బౌలింగ్ చేసేందుకు మొగ్గు చూపాడు. సీఎస్కే ఓపెనర్లు షేక్ రషీద్ (11), ఆయుశ్ మాత్రే (7), రవీంద్ర జడేజా (17) త్వరగానే ఔట్ కావడంతో పవర్ ప్లే ముగిసే సరికే మూడు వికెట్లు కోల్పోయి ఆ జట్టు కష్టాల్లో పడింది. ఈ దశలో సామ్ కరన్ (47 బంతుల్లో 88 రన్స్) ఆ జట్టును ఆదుకున్నాడు.



# తగ్గిన బంగారం ధరలు

గత నెల రోజులుగా ఉక్కిరి బిక్కిరి చేస్తున్న బంగారం ధరలు భారీ ఊరటను ఇచ్చాయి.. బంగారం ధర గత రెండు రోజులుగా తగ్గుముఖం పడుతుంది. ఈ క్రమంలోనే.. గురువారం మరింతగా తగ్గి పసిడి ప్రియులకి భారీ ఊరట కలిగించింది. ఒక్క రోజులోనే బంగారం ధర రూ.2,180 తగ్గింది.. 10 రోజుల్లో ఏకంగా రూ.5,620 ధర తగ్గింది.. ఇవాళ 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.95,730 గా కొనసాగుతోంది.. ఏప్రిల్ 22న లక్ష మార్కు దాటేసిన బంగారం ఆ తర్వాత ఆ దూకుడు కొనసాగించలేదు. — ఆ రోజు నుంచి ఇప్పటి వరకూ మధ్యలో ఒకసారి మాత్రమే స్వలంగా పెరిగింది. ఓవరాల్‌గా ఈ 10 రోజుల్లో 10 గ్రాములకి 5 వేల 620 రూపాయలు రేటు తగ్గింది. వెండి ధర రూ.2వేలు తగ్గి 98000లుగా ఉంది.

లేటెస్ట్ బంగారం, వెండి ధరలు..
హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10గ్రా. బంగారం ధర రూ.87,750 లుగా ఉండగా.. 24క్యారెట్ల బంగారం ధర.. 95,730లుగా ఉంది..
విజయవాడ, విశాఖపట్నంలో.. 22 క్యారెట్ల 10గ్రా. బంగారం ధర రూ.87,750 లుగా ఉండగా.. 24క్యారెట్ల బంగారం ధర.. 95,730లుగా ఉంది..
ఢిల్లీలో 22 క్యారెట్ల ధర 87,900, 24 క్యారెట్ల ధర రూ.95,880, ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.87750, 24 క్యారెట్ల ధర రూ.95,730, చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.87750, 24 రూ.95730 లుగా ఉంది.
హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కిలో వెండి ధర 1,07,000 లుగా ఉంది.. ఢిల్లీలో వెండి ధర కిలో రూ.98,000, ముంబైలో రూ.98,000, చెన్నైలో 1,07,000 లుగా ఉంది.

# ఆయన్ను మంత్రిని చేయాలనే కోరిక ఉండే.. సీఎం రేవంత్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

హైదరాబాద్ రవీంద్ర భారతి వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు తెలంగాణ పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన మహాత్మ బసవేశ్వర జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. కొండంగల్‌లో తాను ఎమ్మెల్యేగా గెలిచానంటే దానికి కారణం వీర శైవ లింగాయత్ సోదరుల మద్దతే కారణమన్నారు. తన నియోజకవర్గంలో అత్యంత ప్రభావంతమైన సమాజంగా వీర శైవ లింగాయత్‌లు ఉన్నారన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత సురేష్ షెట్కార్‌కు నారాయణఖేడ్ అసెంబ్లీ టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించి తన మంత్రివర్గంలో మంత్రిని చేయాలనే కోరిక ఉండేదన్నారు. అందుకే ఢిల్లీ పెద్దలతో మాట్లాడి ఆయనకు ఎమ్మెల్యే టికెట్ వచ్చేలా ఒప్పించానన్నారు. కానీ ఆయనే పెద్ద మనసు చేసుకొని.. అక్కడున్న పరిస్థితుల దృష్ట్యా ఒక్క సీటు ఓడినా ప్రజా ప్రభుత్వం రాదేమోనన్న ఆలోచనతో మిత్రుడు సంజీవ రెడ్డికి తన చేతికొచ్చిన బీఫాంను ఇచ్చినట్లు చెప్పారు. ఇవాళ రేపు వార్డు మెంబర్ కూడా పక్కనోళ్లకు ఇవ్వరని.. అలాంటిది పార్టీ గెలుపు కోసం తన ఎమ్మెల్యే బీఫాంను కూడా సురేష్ షెట్కార్ త్యాగం చేసి గెలిపించారన్నారు. అందుకే ఆయన్ను గౌరవిస్తూ.. జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించి పార్లమెంట్‌కు పంపామన్నారు. ఇక బీఆర్ఎస్



రజతోత్సవ సభలో కాంగ్రెస్‌ను విలన్‌గా ఆ పార్టీ అధినేత కేసీఆర్ అభివర్ణించడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఏడు దశాబ్దాల కలను నిజం చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ విలన్ ఎలా అవుతుందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభకు తాము పూర్తిగా సహకరించామని, ప్రతిపక్షంగా ప్రజల్లోకి వెళ్లి మాట్లాడాలని సూచించారు. రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలు కొనసాగుతున్నాయని, కేసీఆర్‌కు అవి కనిపించడం లేదా ? అని నిలదీశారు. కాంగ్రెస్ పదేళ్లు అధికారంలో ఉంటుందని.. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితం అవుతారని ఎద్దేవా చేశారు. వరంగల్ సభతో పాపాలు కడుక్కోవాలని చూసినా.. చేసిన పాపాలు పోవని రేవంత్ రెడ్డి ఫైరయ్యారు.

# బెట్టింగ్ బారిన పడి మరో యువకుడు ఆత్మహత్య

బెట్టింగ్ బారిన పడి మరో యువకుడు ఆత్మహత్య . మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ యాదగిరి రెండో కుమారుడు రాహుల్ (24) ఇంటర్ వరకు చదివి ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా రాహుల్ మద్యం తాగడం, క్రికెట్ బెట్టింగులు వేయడానికి బానిసగా మారాడు, అప్పు చేసి ఐపీఎల్ బెట్టింగ్‌లో డబ్బులు పెట్టగా, రూ.4 లక్షలు నష్ట పోయాడు . దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యి, ఇంట్లోని తన గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకున్న రాహుల్.బెట్టింగ్ భూతం యువకుల్ని వదలడం లేదు. బెట్టింగ్ యాప్స్ బారిన పడి యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఈ మధ్య పెరిగాయి. ఆన్‌లైన్ బెట్టింగ్, ఈజీ మనీ ఆశతో చాలా మంది డబ్బులు, ఆస్తులు పోగొట్టుకొని, ఆర్థిక ఒత్తిడితో ప్రాణాలు తీసుకుంటున్నారు.




# ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలకు అరుదైన గుర్తింపు

తెలంగాణలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం (OU) ఆర్ట్స్ కళాశాల భవనం అరుదైన గౌరవాన్ని పొందింది. భారతదేశంలో ట్రేడ్‌మార్క్ హోదా సాధించిన ప్రసిద్ధ భవనాల జాబితాలో ఈ భవనం స్థానం దక్కించుకుంది. ముంబైలోని తాజ్ హోటల్, స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనాల తర్వాత ఈ గుర్తింపు పొందిన మూడవ భవనంగా ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల నిలిచింది. ఈ గుర్తింపు ఉస్మానియా విశ్వవిద్యాలయం బ్రాండ్ విలువను మరింత పెంచడమే కాక, దాని చారిత్రక, వాస్తుశిల్ప ప్రాముఖ్యతను జాతీయ స్థాయిలో గుర్తించేలా చేసింది.
చారిత్రక, వాస్తుశిల్ప విశిష్టత
ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల భవనం తన విశిష్టమైన ఆర్కిటెక్చర్ శైలితో ప్రసిద్ధి చెందింది. 1939లో నిర్మితమైన ఈ భవనం ఇండో-సరసెనిక్ శైలిలో రూపొందించబడింది, ఇది భారతీయ, ఇస్లామిక్, పర్షియన్ వాస్తుశిల్ప లక్షణాల సమ్మేళనంగా ఉంటుంది. దీని గంభీరమైన గోపురాలు, విశాలమైన ఆర్చ్‌లు, సున్నితమైన కుండలీకరణలు ఈ భవనాన్ని చారిత్రక వారసత్వ గుర్తుగా నిలిపాయి. ఈ భవనం నిర్మాణంలో హైదరాబాద్ నిజాం ఏడవ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ దూరదృష్టి, ఆర్థిక సహకారం కీలక పాత్ర పోషించాయి.
ట్రేడ్‌మార్క్ హోదా ప్రాముఖ్యత
ట్రేడ్‌మార్క్ హోదా అనేది ఒక భవనం యొక్క ప్రత్యేక గుర్తింపును, దాని బ్రాండ్ విలువను చట్టబద్ధంగా రక్షించే ప్రక్రియ. ఈ హోదా ద్వారా ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల భవనం దేశంలోని ఐకానిక్ నిర్మాణాల సరసన చోటు సంపాదించింది. ఈ గుర్తింపు కళాశాల యొక్క చారిత్రక విలువను కాపాడటమే కాక, దాని వాస్తుశిల్ప అందాన్ని భావితరాలకు అందించేందుకు దోహదపడుతుంది.
OU బ్రాండ్ విలువపై ప్రభావం
ఈ ట్రేడ్‌మార్క్ హోదా ఉస్మానియా విశ్వవిద్యాలయం యొక్క ఖ్యాతిని మరింత ఉన్నతం చేసింది. ఇది విద్యా, సాంస్కృతిక, చారిత్రక కేంద్రంగా OU యొక్క స్థానాన్ని పటిష్టం చేస్తుంది. అంతేకాక, ఈ గుర్తింపు విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, సందర్శకులలో గర్వ భావనను కలిగిస్తూ, హైదరాబాద్ నగరం యొక్క సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అవకాశాన్ని అందిస్తుంది.
ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల భవనం ట్రేడ్‌మార్క్ హోదా సాధించడం ఒక చారిత్రక మైలురాయి. ఈ గుర్తింపు దాని వాస్తుశిల్ప అందం, చారిత్రక విలువలను జాతీయ స్థాయిలో గుర్తించడమే కాక, ఉస్మానియా విశ్వవిద్యాలయం యొక్క వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు కాపాడే దిశగా ముందడుగు వేసింది.

# రహదారిపై ఆటంకాలను తొలగించిన హైడ్రా

దేవరయాంజల్, కండ్లకోయ ప్రజలు సులభంగా జాతీయ రహదారి 44కు చేరుకునే అవకాశం హైడ్రా కల్పించింది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న రహదారిని బండకుంట నరసింహారెడ్డి గేట్లు పెట్టి, రోడ్డును కొంత మేర తవ్వేసి ఆటంకాలు సృష్టించగా.. బుధవారం హైడ్రా వాటిని తొలగించింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా షామీర్‌పేట మండలం దేవరయాంజల్ విలేజికి ఉండే ప్రధాన రహదారిని మూసేశారంటూ స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. రోడ్డుకు అడ్డంగా గేట్లు పెట్టి రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తున్నారని నిర్ధారించుకుంది. కండ్లకోయ 135, 136 సర్వే నంబర్లలో జిల్లా న్యాయస్థాన సముదాయానికి కొంత స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.



అలాగే ఇవే సర్వే నంబర్లలో మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మేడ్చల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నిర్మాణానికి కూడా కొంత స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణం జరగాల్సి ఉండగా.. ఇప్పటికే ఈ మార్గంలో కొన్ని పరిశ్రమలు కూడా ఉన్నాయి. వీటితో పాటు కండ్లకోయ - దేవరయాంజల్ నివాసితులు కూడా ఇదే రోడ్డును వినియోగిస్తున్నారు. ప్రస్తుతం మట్టి రోడ్డు ఉండగా.. త్వరలో 40 అడుగుల విస్తీర్ణంలో దాంబరు రోడ్డు నిర్మించేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రహదారిపై ఆటంకాలు సృష్టించడం ఏంటని స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు.

# స్కూల్ టాపర్‌గా నిలిచింది... మృత్యువు చేతిలో ఓడింది

బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్న ఓ టెన్త్ విద్యార్థి కలలు అంతలోనే ఆవిరయ్యాయి. రాజన్న సిరిసిల్ల(D) బోయినపల్లి(M) మల్లాపూర్‌కి చెందిన ఆకుల రవి-రజిత దంపతులకు చిన్న కుమార్తె నాగ చైతన్య(15) ఇటీవల టెన్త్ పరీక్షలు రాసింది. అయితే ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్న చైతన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 17న మృతి చెందింది. నిన్న విడుదలైన ఫలితాల్లో చైతన్య 510 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఈ ఆనందం పంచుకునేందుకు తమ కూతురు లేదని ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.తెలంగాణ పదో తరగతి పరీక్షల్లో ఈసారి రికార్డు స్థాయిలో 92.78 % మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కరోనా రెండు సంవత్సరాల కాలాన్ని మినహాయిస్తే ఇప్పటివరకు తెలంగాణలో ఇదే అత్యధిక ఉత్తీర్ణత శాతం. మొత్తం 4,96,374 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు.



# కేటీఆర్‌కు ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ ఆహ్వానం..!

మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశానికి హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు ముఖ్యవక్తగా రావాలంటూ కేటీఆర్‌కు ఆహ్వానం. ఇంగ్లాండ్‌లోని ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో జూన్ 20, 21 తేదీల్లో సమావేశాలు. యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, ప్రొఫెసర్లు, వివిధ దేశాల నిపుణులు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఇండియా సాధిస్తున్న ప్రగతిని వివరించనున్న కేటీఆర్ ... కేటీఆర్ ప్రతిష్టాత్మక సమావేశానికి హాజరుకానున్నారు. 2025 జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్‌లో జరిగే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు ముఖ్యవక్తగా పిలుస్తూ ఆ సంస్థ ప్రత్యేకంగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. "భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు" అనే థీమ్‌తో ఈ సంవత్సరం ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం వ్యవస్థాపకులు సిద్ధార్థ్ సేఠీ తెలిపారు. కేటీఆర్ తన అనుభవాలను, ఆలోచనలను అంతర్జాతీయ విద్యార్థులు, వివిధ దేశాల నిపుణులతో పంచుకుంటే చర్చలు మరింత ఆసక్తికరంగా ఉంటడంతో పాటు భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో భాగం అవ్వడానికి వారందరికీ స్ఫూర్తిగా ఉంటుందని సిద్ధార్థ్ సేఠి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంతో పాటు భారత్‌లోని స్థిరమైన అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు ఎలా ఉపయోగపడతాయన్న అంశంపై ఈ సదస్సులో ప్రధానంగా వక్తలు చర్చిస్తారు. వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, నిపుణుల సమక్షంలో భారతదేశ ప్రగతిపథాన్ని, తెలంగాణలో అమలు చేసిన వినూత్న విధానాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి మోడల్‌ను కేటీఆర్ వివరించనున్నారు. ఈ సదస్సులో కేటీఆర్ పాల్గొంటే రాబోయే రోజుల్లో ప్రపంచంపై ఇండియా చూపే సానుకూల ప్రభావాన్ని, నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి బలంగా చాటొచ్చని సిద్ధార్థ్ సేఠి తెలిపారు. ఈ ఆహ్వానాన్ని స్వీకరించి, సదస్సుకు రావాలని సిద్ధార్థ్ కోరారు.ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సమావేశం యూరప్‌లో భారత్‌కు సంబంధించిన అతి పెద్ద కార్యక్రమం. భారతదేశ పురోగతి, ఆవిష్కరణలను ప్రపంచానికి చూపే వేదిక. మనదేశ అభివృద్ధి, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న మార్పులు, గ్లోబల్ సహకార అవకాశాలపై ఈ సమావేశంలో చర్చలు జరుగనున్నాయి. భారత్‌ను ప్రపంచానికి దగ్గర చేయడం, పరిశోధన, సాంకేతికత, విధానాల్లో ఇతర దేశాల భాగస్వామ్యాన్ని పెంచడం ఈ ఫోరమ్ ప్రధాన లక్ష్యం.



# వైఎస్ షర్మిలను అరెస్టు చేసి హైదరాబాద్‌కు పంపిన వైనం



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను విజయవాడ పోలీసులు అరెస్టు చేసి గన్నవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు పంపించారు. మోదీ శంకుస్థాపన చేసిన ఉద్దండరాయుని పాలెంలో పర్యటిస్తానని ఆమె పేర్కొనడం, విజయవాడ కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం వంటి పరిణామాల నేపథ్యంలో పోలీసులు వైఎస్ షర్మిలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను గన్నవరం విమానాశ్రయం వద్దకు తీసుకువెళ్లి హైదరాబాద్ పంపించారు.పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం రాజధాని ప్రాంతంలో పర్యటించాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో తొలుత గన్నవరంలో ఆమెను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ప్రభుత్వం, పోలీసుల వైఖరిని ఖండిస్తూ వైఎస్ షర్మిల కాంగ్రెస్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన దీక్షకు దిగారు.అంతలోనే ప్రధాని మోదీపై షర్మిల అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ కార్యకర్తలు ఏపీసీసీ కార్యాలయంలోకి దూసుకువచ్చారు. పార్టీ కార్యాలయంపై కోడిగుడ్లతో దాడి చేశారు. షర్మిల వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది.పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.